RNI NO.APTEL/2013/49614

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేల్ వ్యాప్తంగా నర్క్యులేల్ కాలదుతూ
ఆంధ్రప్రజలందరి మన్ననను పొందుతున్న రాజనీతి
దినపత్రికకు జిల్లా వ్యాప్తంగా విలేకరులు కావలెను.

ఇతర వివరాలకు వెంటనే సంప్రదించండి:

కాకర్ల పద్మజ చీఫ్ ఎడిటర్
మొబైల్: 9618501530

శ్రీమతి కాకర్ల పద్మజ ప్రధాన సంపాదకత్వంలో

# రాజనీతి

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 13 | సంచిక : 175 | అన్నమయ్య జిల్లా | చీఫ్ ఎడిటర్ : కాకర్ల పద్మజ | మంగళవారం 07 జూలై 2026 | పేజీలు : 04 | వెల : రూ. 2/-




కుప్పం, జూలై 06: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల కుప్పం పర్యటన అత్యంత ఉత్సాహభరితంగా, సంతృప్తికరంగా ముగిసింది. మారుమూల ప్రాంతంగా ఉన్న కుప్పాన్ని అత్యాధునిక వసతులతో దేశానికే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తోందని సీఎం ప్రకటించారు. ప్రశాంతమైన, స్వచ్ఛమైన కుప్పం వాతావరణంలో ప్రజలతో మమేకం కావడం తనకు సరికొత్త శక్తిని ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన భూ సమస్యలపై సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న 'కంగుంది' భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపినట్లు చంద్రబాబు వెల్లడించారు. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో ఎన్నో కుటుంబాలకు న్యాయం చేకూరిందని, భూ సమస్యల పరిష్కారంతో ప్రజల్లో ప్రభుత్వంపై సరికొత్త నమ్మకం ఏర్పడిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కుప్పం రూపురేఖలను మార్చేలా రూ. 9,322 కోట్ల విలువైన 30 భారీ ప్రాజెక్టులకు ఈ పర్యటనలో శ్రీకారం చుట్టినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.ఈ ప్రాజెక్టుల ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.వ్యవసాయం, పౌల్ట్రీ, మ్యానుఫ్యాక్చరింగ్ (తయారీ) రంగాల్లో కొత్త పెట్టుబడులు రావడానికి ఈ ప్రాజెక్టులు మైలురాళ్ళుగా నిలవనున్నాయి. అభివృద్ధి ఫలాలు నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. ప్రజల పూర్తి సహకారంతో కుప్పాన్ని కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా, యావత్ దేశంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా గుర్తింపు పొందేలా తీర్చిదిద్దుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

## 48 గంటలు గడుస్తున్నా ఇంకా తెలియని ఆరుగురు మత్స్యకారుల జాడ..



అమరావతి, జూన్ 6: విశాఖపట్నం చేపల రేవు నుంచి సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల జాడ ఇంకా తెలియరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాఖ మెకనైజ్డ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మత్స్యకారుల కుటుంబ సభ్యులు బైఠాయించి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ నిరసన వ్యక్తం చేశారు. మరికొందరు రోడ్డుకు అడ్డంగా కూర్చుని నినాదాలు చేశారు. 48 గంటలు గడుస్తున్నా తమ సభ్యుల జాడ అధికారులు గుర్తించకపోవడం పట్ల ఆందోళనకు గురవుతున్నారు. మత్స్యకారులను కాపాడేందుకు అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎలాంటి క్షేమ సమాచారం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా సమాచారం అందుకున్న గత 24 గంటలుగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తుంది. ఈ నెల 1న ఏడుగురు సభ్యులు గల బృందం వేటకు వెళ్లి శనివారం సాయంత్రం తిరిగి బయలుదేరారు. ఈ సమయంలో చేపల రేవుకు పది నాటికల్ మైళ్ల దూరంలో ఎత్తైన అల బోటును బలంగా కొట్టడంతో బోటు తిరగబడింది.అందులోని ఏడుగురు మత్స్యకారులు బోటును పట్టుకుని రాత్రి 9 గంటల వరకు సాయం కోసం ఎదురుచూశారు. ఆధారంగా ఉన్న బోటు చివరికి మునిగిపోవడంతో ఈత కొడుతూ తేలియాడే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పోర్టుకు చెందిన వాణిజ్య నౌక కనిపించడంతో నలుగురు దానివైపుగా వెళ్లారు. సమీపంలోకి వెళ్లిన బోటు యజమాని కారి చిన్నను నౌక సిబ్బంది రక్షించారు. అయితే, గల్లంతైన మిగిలిన ఆరుగురు మత్స్యకారుల జాడ నేటికీ తెలియరాలేదు.

## ఆగస్టు 6న భారీ బహిరంగ సభ : టీఆర్ఎస్ చీఫ్ కవిత




హైదరాబాద్ :బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఆగస్టు 6న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ ఆఫీస్‌లో నిర్వహించిన పార్టీ బీసీ నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధనకు సంకల్పం తీసుకుంటామని తెలిపారు. 'సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ' పేరుతో ఈ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. బీసీలతోపాటు సమాజంలోని అన్నివర్గాల వారిని ఒక్కతాటిపైకి తీసుకొచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతామన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ జాగృతి, టీఆర్ఎస్ రెండేళ్లుగా ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్నాయని గుర్తు చేశారు. హైదరాబాద్ వేదికగా నిర్వహించే సభ దేశ గతినే మార్చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తమిళనాడులోని స్కూళ్లలో ఎన్టీఆర్ ప్రారంభించిన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇప్పుడు దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం చేసే ఉద్యమాలకు హైదరాబాద్ సభ దిక్సూచీగా నిలుస్తుందన్నారు. తమ ఉద్యమాలకు తలొగ్గే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా రెండు వేర్వేరు బిల్లులు అసెంబ్లీ, కౌన్సిల్‌లో పాస్ చేసి కేంద్రానికి పంపిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లులకు ఆమోదం తెలిపేలా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస ప్రయత్నాలు కూడా చేయడం లేదన్నారు. మనమెంతో మనకంత అనే నినాదం సాకారం కావాలంటే అన్ని వర్గాలను కలుపుకొని 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేద్దామని పిలుపునిచ్చారు

## పర్యాటక ప్రాజెక్టులకు వేగం పెంచండి



హైదరాబాద్, జూలై 6: రాష్ట్రంలో చేపట్టిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీ లోని లోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో పర్యాటక శాఖ పనితీరును సమీక్షించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని అటవీ భూములను వినియోగించి ఎకో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గురుంగూడ ఎకో పార్క్ తరహాలో నగర పరిసర ప్రాంతాల్లో కొత్త ఎకో పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రకృతి పరిరక్షణతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. హైదరాబాద్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే డిసెంబరులో నిర్వహించనున్న 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్'కు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## పేర్ని నానిపై మంత్రి సత్యకుమార్ మండిపాటు

-అవకాశవాద రాజకీయాలు తనకు తెలియవన్న మంత్రి

-అమరావతి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేస్తామని స్పష్టం

-ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మెరుగడ్డాయని వెల్లడి



అమరావతి, జూలై 6: వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో స్పందించారు. తనపై చేస్తున్న విమర్శలను ఖండిస్తూ, పేర్ని నాని అవకాశవాద రాజకీయాలకు ప్రతీక అని విమర్శించారు. తాను పదవుల కోసం పార్టీలు మారే వ్యక్తిని కాదని, భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్నట్లు స్పష్టం చేశారు. మీడియాతో మాట్లాడిన మంత్రి సత్యకుమార్ యాదవ్, తన రక్తంలోనే సేవ భావం ఉందని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయాలు చేసే వ్యక్తిని తాను కాదని, గత ప్రభుత్వంలో మంత్రిగా ప్రభుత్వంపై వచ్చే నిర్ధారిత విమర్శలను నిరోధించలేకపోయారని గుర్తుచేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ఆరోపణలకు తగిన సమాధానం చెప్పే రోజులు ఉన్నాయని పేర్కొన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడంపై మంత్రి స్పష్టం చేశారు. ఆయన ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ నిర్వహణలో జరిగిన తప్పులపై తాను ప్రశ్నిస్తున్నానని తెలిపారు. ముఖ్యంగా రాజధాని అంశంలో జనసేన వైఖరి స్పష్టంగా ఉందని, అమరావతి విషయంలో ఆయన చేస్తున్న వ్యాఖ్యలు అమరావతి ద్రోహాన్ని క్రమబద్ధీకరించడమేనని విమర్శించారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు తీసుకెళ్తుందని మంత్రి తెలిపారు. ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని, నిర్ణీత గడువులో రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య రంగంలో కూడా ప్రభుత్వం కీలక మార్పులు తీసుకొచ్చిందని సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు గతంకంటే మెరుగడ్డాయని, ఆధునిక వైద్య పరికరాలు, సిబ్బంది నియామకం, రోగులకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలకు మరింత బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిగణిస్తుందని మంత్రి పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాజకీయ విమర్శల కంటే ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## జూలై 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు



న్యూ ఢిల్లీ : జూలై 06 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు 19 రోజుల పాటు జరగనున్నాయి. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టనుంది. డీలిమిటేషన్ బిల్లుపై దక్షిణాది రాష్ట్రాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యే అవకాశం ఉంది. ఉభయ సభల్లోనూ అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడిగా చర్చలు సాగనున్నాయి

# మల్లాపల్లి గ్రామంలో "మాలల మేలుకొలుపు కార్యక్రమం"



శ్రీ సత్యసాయి జిల్లా మల్లాపల్లి జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): శ్రీ సత్యసాయి జిల్లా ాణజ మండలంలోని మల్లాపల్లి గ్రామంలో నేడు (06-07-2026) ఆంధ్రప్రదేశ్ మాల మహానాడు ఆధ్వర్యంలో "మాలల మేలుకొలుపు కార్యక్రమం" ఘనంగా నిర్వహించారు. గ్రామ స్థాయి నుంచి మాల సమాజాన్ని సంఘటితం చేయడం, రాజ్యాంగబద్ధమైన హక్కులపై అవగాహన కల్పించడం, విద్య, ఉపాధి, రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో అభివృద్ధి సాధించేందుకు ప్రతి కుటుంబాన్ని చైతన్యవంతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామ ప్రజలు, యువత, మహిళలతో కలిసి మాల మహానాడు నాయకులు సమావేశమై సమాజ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ాా మాల మహానాడు గౌ,,అధ్యక్షులు, హెచ్ ఆర్ సి సి ఐ జిల్లా ఛైర్మన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న శ్రీ సత్యసాయి జిల్లా ాా మాల మహానాడు గౌ,,అధ్యక్షులు,,హెచ్ ఆర్ సి సి ఐ జిల్లా ఛైర్మన్ డా ,, చెరుకూరి గంగులయ్య మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యే సమాజాభివృద్ధికి మూలాధారమని, యువత ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల్లో రాణించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షులు ఎం ఎన్ మూర్తి మాట్లాడుతూ గ్రామస్థాయిలో మాల మహానాడు కమిటీలను మరింత బలోపేతం చేసి ప్రతి సమస్యపై చట్టబద్ధంగా పోరాడేందుకు కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. సమాజంలో ఐక్యత పెంపొందితేనే సామాజిక న్యాయం, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కో ఆడిటర్ గొల్లపల్లి నాగేంద్ర, మాల మహానాడు సలహాదారులు ఇల్లూరి ఓబులేసు,ఉరుము కళాకారులు ఎద్దుల ఆదిమూర్తి, తుంగ మురళి కృష్ణ,బి,నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బి పనుల పై సమీక్ష..



తిరుపతి జిల్లా రైల్వేకోడూరు జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): రైల్వే కోడూరు లోని ఆర్ అండ్ బి సబ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న పనులపై సోమవారం ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషావల్లి సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కోడూరు, వెంకటగిరి రోడ్డు పనులకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్కు పంపించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రెడ్డివారిపల్లె వద్ద ఉన్న బ్రిడ్జి పనులు దాదాపు పూర్తయ్యాయని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. వేగవంతంగా రైల్వే కోడూరు మండల పరిధిలో ఆర్ అండ్ బి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన విలేకరులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఆర్ అండ్ బి డిఈ జయప్రకాష్, జెఈ దాదాభాష పాల్గొన్నారు

# ఆ ఆలయానికి మంచి రోజులు.. యాదగిరిగుట్ట తరహాలో.. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్ జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): హైదరాబాద్ :రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధిపై తెలంగాణ సర్కారు దృష్టి పెట్టింది. పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా సీఎం రేవంత్ రెడ్డి ప్రణాళికలు రచిస్తున్నారు. క్రమంలోనే రాష్ట్రంలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి పర్యాటక శాఖపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని అటవీ శాఖ భూములలో.. పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో ఉన్న అటవీ భూములను అంతర్జాతీయ స్థాయి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలోనే నగరంలో ఎకో పార్కులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో పర్యాటక ప్రాంతాలను మరింతగా తీర్చిదిద్దాలన్న సీఎం రేవంత్ రెడ్డి.. తారామతి బారాదరి మరింత అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అలాగే దుర్గం చెరువును పూర్తి స్థాయిలో పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను ఆధునికీకరించాలని ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకంలో భాగంగా వికారాబాద్‌ను మరింత అభివృద్ధి చేయాలని, అక్కడ ఉన్న శ్రీ వీరభద్రస్వామి దేవాలయానికి.. యాదగిరిగుట్ట తరహాలో పాలక మండలిని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. క్యూర్ పరిధిలోని అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఎకో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలన్న రేవంత్ రెడ్డి.. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. పురానాపూల్ వంటి వారసత్వ సంపదలను అభివృద్ధి చేసి, పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ట్రాఫిక్ మళ్లించాలని సూచించారు. సమావేశం సందర్భంగా పర్యాటక రంగంలో పెట్టుబడులపై అధికారులను ఆరా తీశారు. వచ్చే డిసెంబర్‌లో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పై కసరత్తును ప్రారంభించాలని.. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# పకడ్బందీగా "ఆపరేషన్ ముస్కాన్"




కరీంనగర్ జిల్లా బ్యూరో: జూన్ 06 (రాజనీతి ప్రతినిధి):: జిల్లాలో ఈ నెల1 నుండి 30 వరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని, ఆపదలో ఉన్న పిల్లలను రక్షించి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. ఈనెల 1 నుండి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న "ఆపరేషన్ ముస్కాన్" కార్యక్రమం పై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా తప్పిపోయిన పిల్లలను, బాల కార్మికులను, ఆపదలో ఉన్న చిన్నారులను రక్షించాలని, ఇందుకోసం విస్తృత తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రక్షించిన వారిని తల్లిదండ్రుల చెంతకు చేర్చాలని, లేదా ప్రభుత్వ సదనాలలో ఆశ్రయం కల్పించాలని అన్నారు. గతంలో జరిగిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల్లో గుర్తించిన పిల్లల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకొని నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వారి సంరక్షణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా పోలీస్, మహిళ, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖలు సమన్వయంతో జిల్లాలో బాల కార్మికులు ఉన్నచోట్లను గుర్తించాలని, నిబంధనలకు విరుద్ధంగా వీరిని నియమించుకున్న వారిపై కేసులు నమోదు చేయాలని అన్నారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై అన్ని కార్యాలయాలు, గ్రామపంచాయతీలు, నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. గుర్తించిన పిల్లలకు సరైన ఆశ్రయం, భోజనం, వైద్యం వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై ప్రతివారం సమీక్ష నిర్వహిస్తామని, ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ధనలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ నితికా పంత్.



కుమురం భీమ్ ఆసిఫాబాద్ జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, చట్టప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజ ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు చేరువగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు

# ఈ నెల 10న జడ్పీ సర్వసభ్య సమావేశం..!



వైస్సార్ కడప :జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఈ సమావేశాన్ని జూన్ 18న నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ, గౌరవ అధ్యక్షుల ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. వాయిదా పడిన ఈ సమావేశాన్ని జూలై 10 (శుక్రవారం) ఉదయం 10 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమాచారాన్ని గుర్తెరిగి... ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జెడ్పీటీసీ) సభ్యులు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని ఈ సందర్భంగా సీఈఓ కోరారు...

# రూ.70 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన చేర్యాల తహసీల్దార్.

సిద్దిపేట జిల్లా, చేర్యాల : ప్రశ్నించే హక్కు : జులై 06: సిద్దిపేట జిల్లా, చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు...వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు ఓ రైతు నుంచి రూ.70 వేల లంచం డిమాండ్ చేసి, తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు...

# 'ప్రజావాణి' దరఖాస్తులను పెండింగ్ లో ఉంచొద్దు



కరీంనగర్ జిల్లా బ్యూరో జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా అత్యంత ప్రాధాన్యమిచ్చి.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా.. అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో షర్మిల, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి కి మొత్తం 169 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 67, కరీంనగర్ నగరపాలికకు 54 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

# హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణం.. తనిఖీలకు ఉన్నతాధికారులు



హైదరాబాద్ జూన్ 06 (రాజనీతి ప్రతినిధి)::హైదరాబాద్ నగర నడిబొడ్డున ఉన్న చారిత్రాత్మక హుస్సేన్ సాగర్ చెరువు పరివాహక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఒక భారీ నిర్మాణంపై అధికారులు ఉక్కుపాదం మోపారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం (ఖీూ) పరిధిలో 'ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్' సంస్థ ఎలాంటి అనుమతులు లేకుండానే పనులు చేపడుతోందన్న ఫిర్యాదులపై ఉన్నతాధికారులు సంచలన నిర్ణయం తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల సంయుక్త తనిఖీలు... ఈ అక్రమ నిర్మాణ వ్యవహారంపై ఫిర్యాదులు రావడంతో సోమవారం నాడు ప్రభుత్వ యంత్రాంగం వేగంగా స్పందించింది. హైడ్రా (న్ణ=ూూ) కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అల నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం వివాదాస్పద నిర్మాణ స్థలాన్ని స్వయంగా పరిశీలించింది. అనుమతులు లేవని తేల్చిచెప్పిన నీటిపారుదల శాఖ.. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తమ శాఖ నుండి ఎలాంటి ఎన్ఓసీ లేదా అనుమతులు జారీ చేయలేదని నీటిపారుదల శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే అధికారులు రంగంలోకి దిగి నిర్మాణానికి సంబంధించిన అన్ని పత్రాలు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ నివేదిక ఆధారంగా సదరు సంస్థపై కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు

# జూలై 8వ నుంచి 'సదరం' స్లాట్ బుకింగ్ ప్రారంభం.

కడప జిల్లా బ్యూరో: జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): ఏపీలోని దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వం దరఖాస్తు ప్రక్రియను జూలై 8 నుంచి ఆగస్టు చివరి వరకు చేపడుతోంది. లబ్ధిదారులు మీ-సేవ లేదా గ్రామ సచివాలయాల ద్వారా జోనల్ స్థాయిలో స్లాట్ బుక్ చేసుకోవాలి. జూలై 13 నుంచి ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న దివ్యాంగుల కోసం 'సదరం' సేవలలో కీలక సంస్కరణలు తెచ్చినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. జులై 13 నుంచి పరీక్షలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. ప్రయాణ భారం తగ్గించేలా రాష్ట్రాన్ని 6 జోన్లుగా విభజించి.. సొంత జోన్లోనే పరీక్షల సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు.

# ఫీజు రాయితీ కల్పించాలని నార్కెట్ పల్లి తహసిల్దారుకు వినతి




నకిరేకల్ జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): జర్నలిస్ట్ పిల్లలకు ఫీజు రాయితీ సర్క్యులర్ జారీ చేయాలనే డిమాండ్ తో టియూ డబ్ల్యూజే జిల్లా కమిటీ ఆదేశాలతో మండల కేంద్రంలో స్థానిక తహశీల్దారుకు మండల జర్నలిస్టులు వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల కోసం, కుటుంబాల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. జర్నలిస్టుల ఐక్యతతోనే సర్క్యులర్ సాధ్యపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ప్రజ్ఞాపురం శివశంకర్, డి. నారాయణ, గర్దాస్ వెంకటేశ్వర్లు, పసునూరి చంద్రశేఖర్, బండారు రాంబాబు, రాధారపు రమేష్, పల్లె తిరుమల్, బండారు చందు, మంద చంటి,వెంకట్ రెడ్డి,సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళాబృందం ద్వారా విద్యార్థులకు అవగాహన.



కుమరం భీమ్ ఆసిఫాబాద్ జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సిర్పూర్ యూ పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ కాలేజ్ లో పోలీస్ కళాబృందం వారు నూతన చట్టాలు,రోడ్డు ప్రమాదాలు మరియు ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, షి టీమ్స్,గంజాయి నివారణ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం భాగంగా సి. ఐ రమేష్ గారు మాట్లాడుతూ ఈ మధ్యకాలం లో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మిహా మోసపోవద్దని, ఎవరైనా మోసపోయినట్లైతేహా 1930 నంబర్ కి పిర్యాదు చేయాలని,యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని,ప్రభుత్వం ,పోలీస్ తరపున అన్ని విధాల సహాయహకారులు ఉంటాయని అన్నారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని,హాలైసెన్స్హా లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్హాఆవశ్యకత గురించి వివరించారు, మంత్రాలు అంటూ ముడనమ్మకాలు నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమ్యస వున్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలుపాలన్నారు.

# ఈ నెల 25న విజయవాడలో ఆల్ ఇండియా స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఫెడరేషన్, ఏపీజేయూ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ సెమినార్.

## -గోడ పత్రికను ఆవిష్కరించిన ఒడిస్సా గవర్నర్ డా.కంభంపాటి హరిబాబు




విజయవాడ/తెనాలి జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): రాష్ట్ర రాజధాని అమరావతి విజయవాడ లెమన్ ట్రీ ప్రీమియర్ హోటల్ లో ఈ నెల 25న ఆల్ ఇండియా స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఫెడరేషన్ న్యూఢిల్లీ, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ సెమినార్ జరగనుంది. ఈ నేపథ్యంలో సెమినార్ గోడ పత్రికను తెనాలిలో జరిగిన స్వాతంత్ర్య సమరయోధులు తామ్రపత్ర అవార్డు గ్రహీతలు రూపాకుల విశాలాక్షి, సుబ్రహ్మణ్యంల కాంస్య విగ్రహాల ఆవిష్కరణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఒడిస్సా రాష్ట్ర గవర్నర్ డా.కంభంపాటి హరిబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీజేయూ రాష్ట్ర శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డా.కాకుమాను వెంకట వేణు, గాదశేశెట్టి శేఖర్ బాబు సీనియర్ జర్నలిస్ట్ డా.నేమాల హేమసుందరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ సెమినార్ కు ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా యూనియన్ ప్రతినిధులు డా.కంభంపాటి హరిబాబును ఆహ్వానించగా ఆయన సానుకూలంగా స్పందింవారు

# ఆరుగురు ఐపీఎస్ అధికారుల బదిలీ.




అమరావతి జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌లో ఆరుగురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి నూతన పోస్టింగ్‌లు కల్పిస్తూ సాధారణ పరిపాలన శాఖ సోమవారం ఆదేశాలు ఇచ్చింది. ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. చింతపల్లి ఏఎస్పీగా పనిచేస్తున్న నవజ్యోతి మిశ్రాను మార్కాపురం జిల్లా ఓఎస్డీ (అడ్మినిస్ట్రేషన్)గా బదిలీ చేశారు. కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ను తూర్పుగోదావరి రూరల్ అదనపు ఎస్పీ (అడ్మినిస్ట్రేషన్)గా నియమించారు. నంద్యాల ఏఎస్పీ మంద జావలి అల్ఫోన్స్ను పోలవరం జిల్లా ఓఎస్డీ (అడ్మినిస్ట్రేషన్)గా బదిలీ చేశారు. రాజంపేట ఏఎస్పీ మననాథ్ హెగ్డేను అమరావతి ఓఎస్డీ (లా అండ్ ఆర్డర్)గా నియమించారు. తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరిని పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మినిస్ట్రేషన్)గా బదిలీ చేశారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుమితను నంద్యాల ఏఎస్పీగా నియమించారు. మంద జావలి అల్ఫోన్స్ స్థానంలో ఆమె బాధ్యతలు చేపట్టనున్నారు. ఐపీఎస్ అధికారుల బదిలీలు, నూతన పోస్టింగ్‌లకు సంబంధించి తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీని ప్రభుత్వం ఆదేశించింది. గవర్నర్ పేరుతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

రాజనీతి
సమగ్ర తెలుగు దినపత్రిక
మంగళవారం 07 జూలై 2026

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి వేడుకలు!



వైస్సార్ కడప జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): కడప నగరంలోని వైఎస్ఆర్సిపి (కా=జూ) జిల్లా పార్టీ కార్యాలయంలో భారత మాజీ ఉప ప్రధాని, నవభారత నిర్మాత, బాబు జగజ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు అత్యంత ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముందు రైల్వే స్టేషన్ రోడ్డు నందు ఉన్న బాబు జగ్జీవన్ రావ్ విగ్రహానికి పూలమాలలు వేసి పేదలకు అల్పాహారం పంపిణీ చేయడం జరిగింది. సందర్భంగా పార్టీ సెంట్రల్ ఆఫీసులో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు.?అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలోని స్వర్గీయ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి కూడా పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ?ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు: ?రాష్ట్ర సిఈసి మెంబర్ కే సురేష్ బాబు ?మాజీ డిప్యూటీ సీఎం ఎస్ బి అంజాద్ బాషా ?,ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి, ?కడప జిల్లా మహిళా అధ్యక్షులు, తెలుగుపులి వెంకటసుబ్బమ్మ,?రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి సునీల్ కుమార్ ?మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి,?కడప ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు,?కడప ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు. ?ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి అనుబంధ విభాగాల నేతలు, మహిళా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని బాబు జగజ్జీవన్ రామ్ గారి సేవలను, దేశానికి ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.

# 12న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

## –గోడపత్రాలను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.




వైస్సార్ కడప జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో 2026-27 సంవత్సరానికి సంబంధించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈ నెల 12 నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహణా సమయంలో.. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోటీలకు సంబంధించిన గోడపత్రాలను జిల్లా కలెక్టర్ డం శ్రీధర్ చెరుకూరి.. జేసీ డా. నిధి మీనా, జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అండర్-17, అండర్-23 విభాగాల్లో బాలురు, బాలికలకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందన్నారు. ఎంపిక పోటీల్లో 100, 200, 400, 800, 1,500, 5,000 మీటర్ల పరుగులు, లాంగ్ జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో తదితర విభాగాల్లో ప్రతిభను పరీక్షించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలను దృష్టిలో ఉంచుకుని ఎంపికైన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని కలెక్టర్ వెల్లడించారు. తొలి శిబిరం జూలై 15 నుంచి 25 వరకు, రెండో శిబిరం జూలై 26 నుంచి ఆగస్టు 10 వరకు, మూడో శిబిరం ఆగస్టు 20 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఆగస్టు 29న జరగనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అర్హులైన యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎంపిక పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయికి అర్హత సాధించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి షేక్ గౌస్ బాషా, జడ్పి సిఇఓ సుబ్రమణ్యం, ఇంచార్జి డీపీవో వెంకటసుబ్బయ్య, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, డీఎస్ఓ రఘురాం, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పట్ల బాధ్యతగా స్పందించాలి..! : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.




వైస్సార్ కడప జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల బాధ్యతాయుతంగా స్పందిస్తూ.. అర్జీదారులకు సంతృప్త స్థాయిలో నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి ముఖ్య అతిథిగా హాజరు కాగా, జేసీ డా. నిధీమీనా, డిఆర్వో మల్లికార్జునుడు ఇతర జిల్లా స్థాయి అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు. ఈవేదిక ద్వారా అందే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రెవెన్యూ క్లినిక్ ల ద్వారా భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పరిశీలనలో.. పిజిఆర్ఎస్ వ్యవస్థ నిర్వహణలో జిల్లా పనితీరు బాగుందని.. అర్జీల పరిష్కారంలో ఇంకా కొద్దిపాటి ఆలస్యంపై అన్ని శాఖకు అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల పరిష్కార నివేదిక అందివ్వడంలో.. గ్రీవెన్స్ రిడ్రెసల్ అథారిటీ బాధ్య అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన, నేరుగా అర్జీదారులతో మాట్లాడటం జరగాలన్నారు. పొంతనలేని సమాధానాలు అర్జీదారులకు అందివ్వకూడదని, అర్జీదారుడు అందించే ఫిర్యాదుకు.. సరైన, సూటి సమాధానం ఇవ్వాలన్నారు. ఈ విషయంలో తహసీల్దార్లు శాఖాధిపతులు ఎల్లపుడు పైస్థాయి అధికారులు, పిజిఆర్ఎస్ సిబ్బంది, ఫిర్యాదుదారులు సమాచారం అందివుచ్చుకునేలా అందుబాటులో ఉండాలని, ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేసుకోవాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు.. 1) సికేదిన్నె మండలం బలిజపల్లి గ్రామానికి చెందిన కొండయ్య.. తమ గ్రామానికి బస్సు సర్వీస్ నిలిపి వేశారని. ఆటోలు లేక ప్రయాణానికి ఇబ్బందిగా ఉందని బస్సు సౌకర్యం కల్పించాలని అర్జీని సమర్పించారు. 2) చెన్నూరు మండలంకు చెందిన పి.సుబ్బన్న వృద్ధాప్య పెన్షన్ మంజూరు కొరకు జిల్లా కలెక్టర్ వారికి అర్జీని సమర్పించారు. 3) సికేదిన్నె మండలం కొలుమల పల్లెకి చెందిన ఆర్ పెద్ద మల్లారెడ్డి... కొలుమలపల్లె, జమాల్ పల్లె, ఇప్పపెంట గ్రామాలలోని పంట పొలాలలో 765 కేవీ ట్రాన్స్మిషన్ లైన్స్ వేస్తున్నారని ప్రభుత్వానికి ట్రాన్స్మిషన్ లైన్స్ వేయవద్దని విన్నవించుకున్నా కూడా లైన్స్ వేశారని.. ప్రస్తుతం ప్రభుత్వానికి లైన్స్ వేయకుండా చర్యలు తీసుకోవాలని అర్జీని సమర్పించారు. 4) వీరబల్లి మండలానికి చెందిన బి. భాస్కర్ రెడ్డి.. వీరబల్లి సబ్ స్టేషన్ వెనకాల 1980 సం నుండి ఉన్న ఆశ్రమంలో 1994 లో నాటిన దేవత మరి చెట్టుని మీణచీ సరస్వతిఏ కుంటి స్వామి అకారణంగా 18.06.2024 న నరికి వేయడం జరిగిందని.. విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ సుబ్రమణ్యం, ఇంచార్జి డీపీవో వెంకటసుబ్బయ్య, డిఆర్డిఏ పిడి జి.రాజ్యలక్ష్మి, డీఎస్ఓ రఘురాం, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

# హోమ్ గార్డుల ఆదర్శం...పదవీ విరమణ పొందిన హోమ్ గార్డుకు రూ.4,01,860 ఆర్థిక సాయం.



వైస్సార్ కడప జూన్ 06 (రాజనీతి ప్రతినిధి):: మానవత్వం, ఐకమత్యం కేవలం మాటల్లోనే కాదని జిల్లాలోని హోమ్ గార్డులు నిరూపించారు. తమతో కలిసి విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన హోమ్ గార్డుకు అండగా నిలబడి అభినందనలు అందుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో జిల్లా పోలీస్ కార్యాలయంలో హోమ్ గార్డుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఎస్. నూర్ అహమ్మద్( హెచ్.జి 150) పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నూర్ అహమద్ కు తమ వంతు సాయం అందించేందుకు జిల్లాలోని హోమ్ గార్డులందరూ ముందుకు వచ్చారు. స్వచ్ఛందంగా ఒకరోజు వేతనాన్ని వితరణగా ఇచ్చి పోగు చేసి రూ. 4,01,860 సేకరించారు. ఈ ఆర్థిక సాయాన్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్.పి శ్రీ జిల్లా ఎస్.పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ చేతుల మీదుగా రూ.4,01,860 చెక్కును ఎస్. నూర్ అహమ్మద్ కు అందచేశారు. ఈ సందర్భంగా హోమ్ గార్డుల ఐకమత్యాన్ని, వారి గొప్ప మనసును జిల్లా ఎస్.పి ప్రత్యేకంగా అభినందించారు. పదవీ విరమణ పొందిన హోమ్ గార్డు ఎస్. నూర్ అహమ్మద్ కుటుంబ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్.ఐ ఎ.శివరాముడు పాల్గొన్నారు.

# కేఎంసి నూతన కమిషనర్‌గా భవాని ప్రసాద్ బాధ్యతల స్వీకరణ.

## –జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కమిషనర్.



కడప జిల్లా బ్యూరో: జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): కడప నగరపాలక సంస్థ (కేఎంసి) నూతన కమిషనర్‌గా పి. భవాని ప్రసాద్ సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ డా. చెరుకూరి శ్రీధర్ ని మర్యాదపూర్వకంగా కలిసి వారి మార్గదర్శకాలను స్వీకరించారు.అనంతరం సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన ను కూడా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు.ఈ సందర్భంగా నూతన కమిషనర్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ.. కడప నగరాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన పౌర సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ నగరాన్ని మరింత పరిశుభ్రంగా, అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

# ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి




వైస్సార్ కడప జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): కడప జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన (గ్రీవెన్స్) కార్యక్రమంలో ఏ.పీ.ఎస్.ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ, ఏ.పీ.ఎస్.ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్ గారికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ , యూనియన్ జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ మాట్లాడుతూ, ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న ఉద్యోగ భద్రత, తక్కువ వేతనాలు, సంక్షేమ సౌకర్యాల కొరత, ఇతర సేవా సంబంధిత సమస్యలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఔట్‌సోర్సింగ్ కార్మికులకు శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని వారు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జాయింట్ కలెక్టర్ సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చి, సంబంధిత జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ)తో సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కడప జోనల్ కార్యదర్శి శివశంకర్, కడప జిల్లా కార్యదర్శి స్టీఫెన్, జిల్లా నాయకులు గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు

# పాత కడప దళితుల భూమి సమస్యను పరిష్కరించాలి.

## –మా భూములు మాకు ఇప్పించండి... దళిత రైతులు




వైస్సార్ కడప జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): కడప చిన్నచౌక్ గ్రామ పొలం, సర్వే నెంబర్, 919/1, సబ్ డివిజన్ 1145,1146, లోని భూమి మాదేనని మా భూములు మాకే చెందేలి చూడాలని దళిత రైతులు ధర్నా చేపట్టారు. 2005 సంవత్సరంలో అప్పటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం దళితులకు ప్రభుత్వ భూమిని నగరం శివారు లోని వాటర్ గండి ప్రాంతంలో ఒక్కోరికి ఎకరం 55 సెంట్లు చొప్పున ఏడు మందికి భూమిని పంచిందని భూమికి సంబంధించిన పట్టా, పాస్ పుస్తకం, వన్ బి, అడంగల్, రాజముద్రలతో ఆన్ లైన్ నందు మా పేరు పైనే ఉన్నాయని, రైతు భరోసా నుండి డబ్బులు కూడా మాకు అందాయని, తాసిల్దార్ ఎండాస్మెంట్ కూడా మాకు అనుకూలంగా ఇచ్చారని, భూమికి సంబంధించిన ప్రభుత్వపత్రాలన్ని మాకు ఉన్నాయని, ఇవన్నీ ఏమీ లేని ఒక అగ్ర కులానికి చెందిన వారు మా భూమిని ఆక్రమించుకున్నారని వారు వివరించారు. పాత కడపకు చెందిన దళితుల భూములు మాకు చెందే అంతవరకు దశలవారీగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు అన్నారు.ధర్నా అనంతరం గ్రీవెన్స్ కార్యక్రమంలో ఉన్న డిఆర్ఓ కు వినతి పత్రాన్ని అందజేసి సమస్యను వివరించారు.కార్యక్రమంలో దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటేష్, మడగలం ప్రసాద్, పాత కడప దళిత భూమి బాధ్యతలు ఓబులేసు, సుబ్బయ్య దివాకర్ ఓబులేసు వెంకటసుబ్బయ్య శివలక్ష్మి, రైతు నాయకులు మునిరెడ్డి ప్రతాపరెడ్డి చాపల సుబ్బరాయుడు, పాత కడప దళితులు పాల్గొన్నారు

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి...!

## –స్వయం సహాయక సంఘాల సభ్యులకు పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.



వైస్సార్ కడప: జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు చురుకుగా పాల్గొని ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించేందుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటన ద్వారా కోరారు. ఇప్పటికే ఎన్యుమరేషన్ ఫారం (ఈఎఫ్) పూరించిన వారు ఆలస్యం చేయకుండా తమ ఆర్‌పీ/యానిమేటర్ ద్వారా లేదా నేరుగా బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)కి అందజేయాలని సూచించారు. ఫారం సమర్పించని పక్షంలో డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదుకాకపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంకా ఫారం పూరించని వారు వెంటనే ఆర్‌పీ, యానిమేటర్ సహాయంతో పూర్తి చేసి బీఎల్ఓకు సమర్పించాలని సూచించారు. ఫారం పూరించేందుకు బీఎల్ఓ అందించిన ఈఎఫ్ ఫారం, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ (ఐచ్ఛికం), అలాగే 2002లో కుటుంబ సభ్యులు ఓటరుగా నమోదై ఉంటే వారి వివరాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. 2002 నాటి ఓటరు వివరాలు తెలియకపోయినా, అప్పట్లో ఓటు వేసిన గ్రామం లేదా పట్టణం పేరు తెలిస్తే బీఎల్ఓ సహకారం అందిస్తారని పేర్కొన్నారు. ఫారంలో పుట్టిన తేదీ, తల్లిదండ్రుల వివరాలు, మొబైల్ నంబర్ వంటి వ్యక్తిగత వివరాలను పూర్తిగా నమోదు చేయాలని, ఓటరు లేదా కుటుంబంలోని వయోజన సభ్యుడి సంతకం లేదా బొటనవేలు ముద్ర తప్పనిసరిగా ఉండాలని, ఫోటో సక్రమంగా అతికించి పూర్తి చేసిన ఫారాన్ని బీఎల్ఓకు అందజేయాలని సూచించారు. ఇంకా ఓటరుగా నమోదు కాని అర్హులు అవసరమైన గుర్తింపు పత్రాలు, ఫోటోతో బీఎల్ఓను సంప్రదించి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఈ కార్యక్రమంలో భాగస్వామి కావడం ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని, అందరూ బాధ్యతగా సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు...

# క్షయ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ: జిల్లా టి.బి. నియంత్రణ అధికారి డాక్టర్ రాధిక



రాయచోటి / రామాపురం జూన్ 06 (రాజనీతి ప్రతినిధి):: రాయచోటి డివిజన్ పరిధిలోని రామాపురం, చిన్నమండెం మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో (పీహెచ్‌సీ) సోమవారం (06/07/2026) క్షయ (టి.బి.) వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. శ్రీమతి మడితాటి రెడ్డెమ్మ మరియు కీర్తిశేషులు రాజారెడ్డి గార్ల జ్ఞాపకార్థం దాతల సహకారంతో చిన్నమండెంలో 16 మందికి, రామాపురంలో 14 మందికి (మొత్తం 30 మందికి) ఈ కిట్లను అందజేశారు. రామాపురం పీహెచ్‌సీలో జిల్లా టి.బి. నియంత్రణ అధికారి డాక్టర్ రాధిక, చిన్నమండెంలో అన్నమయ్య జిల్లా డి.ఎమ్.హెచ్.ఓ కార్యాలయ పరిపాలనాధికారి డాక్టర్ మధుసూదన్ రెడ్డి, స్థానిక వైద్యాధికారులతో కలిసి ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. 'టి.బి. ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా 2027 నాటికి దేశాన్ని క్షయ రహితంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రోగులు త్వరగా కోలుకోవడానికి మందులతో పాటు పౌష్టికాహారం ఎంతో అవసరమని, ఇందుకోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి టి.బి. రోగులను దత్తత తీసుకోవాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ.. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో టి.బి. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స మరియు మందులు పూర్తిగా ఉచితంగా లభిస్తాయని, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లో తిరిగే 104 వాహన సేవల్లో కూడా గళ్ళ పరీక్షలు, ఎక్స్‌రే సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రోగులకు అండగా నిలిచిన దాతలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం టి.బి. నివారణకు సంబంధించిన కరపత్రాలు, ప్లకార్డులను ఆవిష్కరించారు.

# సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్: పీలేరులో 40వ వర్ధంతి వేడుకలు



పీలేరు జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): కులరహిత సమాజ స్థాపన కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పాటుపడిన దేశ మాజీ ఉపప్రధాని, నవభారత నిర్మాత డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ గారి 40వ వర్ధంతి వేడుకలను సోమవారం (06-07-2026) పీలేరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక సమానత్వం మరియు దళితుల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు బాబూజీ అని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వంలో ఆయన నిర్వహించిన వ్యవసాయ, రక్షణ, రైల్వే వంటి కీలక శాఖలలో తీసుకొచ్చిన విప్లవాత్మక సంస్కరణలు దేశ చరిత్రలో స్వర్ణాక్షరాలతో లిఖించదగినవని పేర్కొన్నారు. ప్రజల హృదయాలలో 'బాబూజీ'గా చెరగని ముద్ర వేసుకున్న ఆయన ఆశయాలు, త్యాగాలు ప్రతి భారతీయుడికి ఆదర్శమని, ఆయన చూపిన సమానత్వ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ నివాళి కార్యక్రమంలో నడిమికండ్రిగ సుధాకర్ బాబు, తుమ్మల ధరణ్ కుమార్, నగరిమడుగు సుభాష్, జెట్టి మల్లికార్జున, కొత్తపేట ప్రసాద్, సద్దల శ్రీకాంత్, బోయిని చంద్రశేఖర్, తెరకాల్ల కృష్ణయ్య తదితరులు పాల్గొని అంజలి ఘటించారు.

# దారి తప్పిన ఏనుగుల బీభత్సం: పంటలకు భారీ నష్టం, రైతుల ఆందోళన



కె.వి.పల్లి జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): అన్నమయ్య జిల్లా కె.వి.పల్లి మండలంలోని నూతన కాలువ పంచాయతీ పరిధిలో దారి తప్పిన ఏనుగుల గుంపు తీవ్ర బీభత్సం సృష్టించింది. గురకంపల్లికి చెందిన ఉప్పుతోళ్ల నాగయ్య కుమారుడు, రైతు ఉప్పుతోళ్ల వెంకటరమణ పొలంలోకి చొరబడిన ఏనుగులు వరి పంట, సుమారు 30 టెంకాయ చెట్లు, బొప్పాయి, నేరేడు తోటలను తొక్కి, విరగ్గొట్టి తీవ్ర నష్టం కలిగించాయి. పంటలతో పాటు పొలానికి ఏర్పాటు చేసిన బోరు బావిని ధ్వంసం చేసి, నీటి సరఫరా పైపులను తొక్కేయడంతో అవి పూర్తిగా విరిగిపోయాయి. ఈ దాడి వల్ల తనకు సుమారు రూ. 5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత రైతు వెంకటరమణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్టుబడి ఖర్చులతో సతమతమవుతుంటే, ఈ ఘటన కోలుకోలేని దెబ్బ తీసిందని వాపోయారు. భయాందోళనలో గ్రామస్తులు -- అధికారుల పరిశీలన: సుమారు 6 నుంచి 8 ఏనుగులు ఉన్న ఈ గుంపు ఇంకా సమీప అటవీ ప్రాంతంలోనే సంచరిస్తుండటంతో గ్రామస్తులు రాత్రి వేళల్లో పొలాల వైపు వెళ్లడానికి భయాందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పంట నష్టాన్ని పరిశీలించారు. ఏనుగుల కదలికలపై నిఘా ఉంచామని, వాటిని సురక్షితంగా అడవిలోకి మళ్లించేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం స్పందించి తనకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

# హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణలో సమన్వయంతో పనిచేయాలి: జిల్లా అధికారి డాక్టర్ జి. వెంకట ప్రసాద్



చిత్తూరు జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ మరియు నివారణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి కౌన్సిలర్లు మరియు స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ జి. వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసీటీసీ (×జుజ), డీఎస్ఆర్ఎస్ (ఋూఞా) కౌన్సిలర్ల ప్రత్యేక సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. హెచ్ఐవీ/ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనలో కౌన్సిలర్ల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. పరీక్షలకు వచ్చే ప్రతి వ్యక్తి వ్యక్తిగత వివరాల గోప్యతను కాపాడుతూ, వారికి నాణ్యమైన కౌన్సెలింగ్ సేవలు అందించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల (ఎన్‌జీఓ) సహకారంతో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు మరియు వాటి పరిష్కార మార్గాలపై సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సీపీఎం కోటి రెడ్డి, ఐసీటీసీ, డీఎస్ఆర్ఎస్ కౌన్సిలర్లు మరియు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక: ఏఐసీసీ సెక్రటరీ గణేష్ యాదవ్



రాయచోటి జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఏఐసీసీ (ూ×జజ) సెక్రటరీ గణేష్ యాదవ్, పీసీసీ (ౡజజ) వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వల్లి పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా గణేష్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అసలైన వెన్నెముక అని, వారి అంకితభావం, కృషి వల్లే పార్టీ నిలబడిందని కొనియాడారు. ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వల్లి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ విధివిధానాలపై జిల్లా నాయకులు, క్షేత్రస్థాయి కార్యకర్తలతో విస్తృతంగా చర్చించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి పార్టీ పూర్వవైభవాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల భాస్కర్, పీలేరు నియోజకవర్గ ఇంచార్జ్ బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, పీలేరు మండల అధ్యక్షుడు దుబ్బా శ్రీకాంత్‌తో పాటు రాయచోటి, పీలేరు నియోజకవర్గాలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. అధికారులకు ప్రభుత్వం పూర్తి అండ: ఎమ్మెల్యే పులివర్తి నాని




పాకాల జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): మండల సర్వసభ్య సమావేశానికి ప్రతి శాఖ అధికారి విధిగా హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచించారు. పాకాల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ అధ్యక్షుడు లోకనాథం ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మండలంలోని సమస్యలు, అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. సమావేశంలో లేవనెత్తిన ప్రతి సమస్యను రికార్డు చేసి, సంబంధిత అధికారుల ద్వారా వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండేళ్ల కాలంలో రాజకీయ పార్టీలకు అతీతంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని గుర్తుచేశారు. అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు కొందరు బెదిరింపులు, ప్రలోభాలకు పాల్పడుతున్నారని, అధికారులు అలాంటి ఒత్తిళ్లకు భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారికి పూర్తి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. త్వరలో పదవీకాలం ముగియనున్న జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ ప్రజాప్రతినిధులను ఎమ్మెల్యే పులివర్తి నాని ఈ సందర్భంగా శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం సమన్వయంతో పనిచేస్తూ చంద్రగిరి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు.

# టీటీడీలో జూన్ నెలలో రికార్డు స్థాయిలో లడ్డూ అమ్మకాలు!



తిరుమల జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): తిరుమల తిరుపతి దేవస్థానం (ఝఝ) జూన్ 2026 నెలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం అమ్మకాలలో సరికొత్త రికార్డు సృష్టించింది. జూన్ నెలలో ఏకంగా 1.26 కోట్లకు పైగా (1,26,81,805) లడ్డూలు అమ్ముడయ్యాయి. ఇప్పటివరకు టీటీడీ చరిత్రలో ఒక్క నెలలో అమ్ముడైన అత్యధిక సంఖ్య ఇదే కావడం విశేషం. 1,26,81,805 లడ్డూలు. గత సంవత్సరం జూన్ నెలతో పోలిస్తే ఈసారి అమ్మకాలు 6.37% పెరిగాయి (అనగా అదనంగా 7,59,452 లడ్డూలు అమ్ముడయ్యాయి). ఈ ఏడాది వేసవి సెలవుల రద్దీ కారణంగా నెలనెలా లడ్డూల విక్రయాలు భారీగా పెరిగాయి. (ఏప్రిల్: 1.11 కోట్లు, మే: 1.21 కోట్లు, జూన్: 1.26 కోట్లు). వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలకు భక్తుల రాక రికార్డు స్థాయిలో పెరగడం వల్లే లడ్డూల అమ్మకాల్లో ఈ ఘనత సాధ్యమైందని టీటీడీ అధికారులు తెలిపారు. స్వామివారి దర్శనానికి వస్తున్న భక్తులకు లడ్డూ ప్రసాదం కొరత లేకుండా నిరంతరాయంగా అందిస్తున్న పోటు (లడ్డూల తయారీ కేంద్రం) సిబ్బందిని, దేవస్థానం యాజమాన్యాన్ని పలువురు అభినందిస్తున్నారు.

# ఎన్టీఆర్ వైద్య సేవలను మరింత మెరుగుపరుస్తాం: జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ పి. లోకవర్ధన్



పుంగనూరు జూన్ 06 (రాజనీతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందిస్తున్న 'డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ'లను ప్రజలకు మరింత నాణ్యంగా, వేగంగా చేరవేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ పి. లోకవర్ధన్ తెలిపారు. ఇందులో భాగంగా ఆయన పుంగనూరు ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఇన్-పేషెంట్లుగా చేరి చికిత్స పొందుతున్న లబ్ధిదారులను ఆయన వ్యక్తిగతంగా పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య సేవలు, ఉచిత మందులు, మరియు సిబ్బంది పనితీరుపై నేరుగా రోగులను అడిగి ఆరా తీశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల పట్ల, రోగుల సంరక్షణ పట్ల ఆయన ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు. 104 సేవా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ: అనంతరం పుంగనూరులోని 104 సేవా కేంద్రాన్ని డాక్టర్ లోకవర్ధన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో రికార్డులను పరిశీలించి, వాహనం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుతున్న ఉచిత వైద్య సేవలు, గర్భిణీలు మరియు దీర్ఘకాలిక రోగులకు అందిస్తున్న మందుల నిల్వలను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతినెలా షెడ్యూల్ మేరకు మందుల పంపిణీ జరగాలని, ఎక్కడా లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు, ఎన్టీఆర్ వైద్య సేవ మిత్రలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published & Owned by Smt.kakarla padmaja, Published at Do.No.3-267/5, Ragavendra Colony, Greemspeta, Chittoor Dist, Ap. and Printed at Prajasakthi Press, Renigunta road, Tirupati, Chittoor, A.P. Editor : N.Nagaraju, RNI No. APTEL/2013/49614